క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిఅర్బన్: పట్టణంలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 6,28,37 వార్డులలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డులలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డులో దోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి మహాలక్ష్మీపతి రావు, కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని చెప్పారు. కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

7న డైక్ సెంటర్‌లో వినికిడి పరీక్షలు

తెనాలిఅర్బన్: నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ డెఫ్‌నెస్ కార్యక్రమంలో భాగంగా దీన దయాళ్ శ్రావణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాల ఆవరణలోని డైక్ సెంటర్‌లో ఉచిత చెవి పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా పరికరాలు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. వినికిడి లోపం ఉన్నవారు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. తెనాలి డివిజన్‌లోని వినికిడి సమస్య ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా 'ఆచంటి'

తెనాలిరూరల్: తెనాలి ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా అచంటి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రేపల్లెలో పని చేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2014 నుండి 2019 వరకు అప్పటి తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పీఏగా ఇక్కడ విధులు నిర్వహించారు. నూతన సూపరింటెండెంట్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

మద్యం దుకాణాలకు నాలుగు దరఖాస్తులు

తెనాలిరూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తెనాలి టౌన్, తెనాలి మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మొత్తం 25 దుకాణాలకు తెనాలి కార్యాలయంలో శుక్రవారం నాటికి నాలుగు దుకాణాలకు నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తెలిపారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోండి

తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ వల్లూరు మహాలక్ష్మీపతి పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేగాలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో సాలీపేటలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి, శానిటరీ సెక్రటరీ జి.నాగేశ్వరరావు, కె.సురేష్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. గ్రామంలోని ఓ గోడౌన్‌లో 80 బస్తాల్లో నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బందితో ఆకస్మిక దాడులను శుక్రవారం నిర్వహించారు. బియ్యం బస్తాలను స్వాధీనపర్చుకున్నారు. ఎవరు నిల్వ చేశారు? ఎక్కడి నుంచి బియ్యాన్ని సేకరించారన్న అంశాలను పరిశీలిస్తున్నారు.

క్రేన్ ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు



తెనాలిరూరల్: పట్టణ చెంచుపేటలో శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని భారీ క్రేన్ ఢీ కొట్టిడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. సుల్తానాబాద్‌కు చెందిన ధనావత్ హేమలీ బాయి ఉదయం మందుల కోసమని ఇంటి నుంచి ఆటోలో చెంచుపేట వచ్చింది. భాను టీ స్టాల్ వద్ద రోడ్డు దాటుతున్న ఆమెను సుల్తానాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన భారీ క్రేన్ ఢీ కొట్టింది. దీంతో ఆమె కాలు, నడుము నుజ్జునుజ్జు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్రేన్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. స్థానికులు స్పందించి 108 సహాయంతో ఆమెను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఆమె కుమార్తె, కోడలు మంగీబాయి, జ్యోతి ఆస్పత్రికి చేరుకున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమాత్యా.. మా వైద్యశాల

సమస్యలు పరిష్కరించరూ..

తెనాలి జిల్లా వైద్యశాలలో వ్యాధుల తిష్ట

- అయిదుగురు డాక్టర్‌లు, ఆరుగురు స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీ
- ఎన్‌హెచ్‌ఎం పరిధిలోని 34 మంది తొలగింపు
- తల్లిపిల్లల వైద్యశాలకు నేటికీ మంజూరు కానీ పోస్టులు
- అప్పుడప్పుడు కొన్ని విభాగాలలో స్తంభిస్తున్న సేవలు
- పనిచేయని సిటీ స్కాన్ మిషన్
- ఇబ్బందులు పడుతున్న రోగులు





పనిచేయని సిటీ స్కాన్ యూనిట్

తెనాలిఅర్బన్: ఏకైక జిల్లా వైద్యశాలగా పేరొందిన తెనాలి జిల్లా వైద్యశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నేటికీ వైద్యులు, సిబ్బంది కొరతతో సతమతమౌతోంది. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేసే 34 మంది విధులకు దూరం కావటంతో రోగులకు అందించే సేవలలో కొంత జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా 100 పడకల తల్లిపిల్లల వైద్యశాలను ప్రారంభించి సుమారు 12 సంవత్సరాలు దాటినా నేటికీ వైద్యులు, సిబ్బంది పోస్టులు మంజూరు కాలేదు. దీంతో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బందే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందించాల్సి వస్తోంది. తెనాలి జిల్లా వైద్యశాల 200 పడకలతో 2000 సంవత్సరంలో చెంచుపేటలో ప్రారంభమైంది. అదే ఆవరణలో 100 పడకల తల్లి పిల్లల వైద్యశాలను 2012లో ఏర్పాటు చేశారు. తెనాలి, వేమూరు, రేపల్లె, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పేదలు దీని సేవలు వినియోగిస్తుంటారు. జిల్లా వైద్యశాలలో ప్రతిరోజు 800 మంది, తల్లిపిల్లల వైద్యశాలలో 600 మంది సేవలు పొందుతుంటారు. ఇదే ఆవరణలో గతేడాది డైక్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణంలో ఉంది.

ఖాళీగా వైద్యులు, సిబ్బంది పోస్టులు

తెనాలి జిల్లా వైద్యశాలలో 40 మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 35 మంది పని చేస్తున్నారు. అలాగే 48 మంది స్టాఫ్ నర్సులు పనిచేయాల్సి ఉండగా నేడు 42 మంది పనిచేస్తున్నారు. అలాగే ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో పోస్టులు ఖాళీగా ఉండటంతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌ల పేరిట కొందరిని నియమించి వారిని ఆసేవలకు వినియోగిస్తున్నారు. ఇదిఇలా ఉంటే నేషనల్ హెల్త్ మిషన్ కింద గతంలో కేంద్ర ప్రభుత్వం ఏడుగురు వైద్యులను, 28 మంది సిబ్బందిని నియమించి వారితో ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్ వంటి విభాగాలలో సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. ప్రోగ్రామ్ ముగియటంతో వారందరినీ విధుల నుంచి తొలగించింది. దీంతో వివిధ విభాగాలలో రోగులకు అందించే సేవలలో జాప్యం జరుగుతుంది.

12 సంవత్సరాలు దాటిన మంజూరు కానీ పోస్టులు

తల్లిపిల్లల వైద్యశాలను ఏర్పాటు చేసిన సమయంలో దానికి సరిపడేంత మంది వైద్యులు, సిబ్బంది పోస్టులు మంజూరు చేస్తామని ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ నేటికి 100 పడకల తల్లిపిల్లల వైద్యశాలకు పోస్టులు మంజూరు కాలేదు. దీంతో జిల్లా వైద్యశాలలో పనిచేసే వైద్యులు, సిబ్బందితోనే దాని సేవలు నిర్వహించాల్సి వస్తోంది. దీనివల్ల వైద్యులు, సిబ్బందిపై అదనపు భారం పడుతుంది.

నేటికి పనిచేయని సిటీ స్కాన్ యూనిట్

తెనాలి జిల్లా వైద్యశాలలోని రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు గతంలో సిటీ స్కాన్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దానిని పరిమితికి మించి వాడటంతో సుమారు ఏడు సంవత్సరాల క్రితం దాని సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. తెనాలికి నూతన మిషన్ మంజూరు అయినప్పటికీ నేటికీ అది తెనాలి చేరలేదు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గతంలో అంబులెన్స్‌లు రెండు ఉండేవి. అవి పాడైపోవటంతో వాటిని మూలన పడేశారు. ఏదైన అనుకోని పరిస్థితి ఏర్పడితే రోగిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపాల్సి వస్తే 108ను ఆశ్రయించాల్సి వస్తోంది. అది అందుబాటులో లేకపోతే ప్రయివేట్ అంబులెన్స్‌లే దిక్కుగా మారుతున్నాయి. శనివారం తెనాలి జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథులుగా వస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి వైద్యశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

వైద్యశాలలోని సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వీటిని జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తాం. వారి సహకారంతో వాటిని పరిష్కరించే విధంగా చూస్తాం.

– డాక్టర్ మజీదా బేగం, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జిల్లా కోఆర్డినేటర్

నేడు తెనాలిలో అవార్డుల ప్రదానోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన విశాలాంధ్ర ఉద్యమ నేత, మానవతావాది, కళాపోషకుడు స్వర్గీయ నన్నపనేని వెంకట్రావు పేరుతో నిర్వహిస్తున్న నన్నపనేని వెంకట్రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా జరుగుతున్న అవార్డుల ప్రదానోత్సవం శనివారం జరగనుంది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజి సెక్రటరీ/కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఆరోజు సాయంత్రం ఆరుగంటలకు స్థానిక ఎన్‌వీఆర్ కన్వెన్షన్ సెంటరులో ఏర్పాటయే అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు, లక్షకు పైగా గ్రంథాలను సేకరించిన అరుదైన పుస్తకాల ప్రేమికుడు లంకా సూర్యనారాయణ, తెనాలికి చెందిన పేదల వైద్యుడు, చైతన్యవేదిక అధ్యక్షుడుగా, ది కల్చరల్ ఫిలిమ్ సెంటర్ అధ్యక్షుడుగా ఉత్తమ సినిమాలను, సాహితీవేత్తలను గౌరవిస్తూ పుస్తకాలను తీసుకొస్తున్న డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి ఈ సంవత్సరం అవార్డులను ప్రదానం చేస్తామని తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటయే సభలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, నన్నపనేని రాజకుమారి పాల్గొంటారని తెలియజేశారు. నన్నపనేని వెంకట్రావుకు ఆసక్తి కలిగిన కళా, సాహిత్యం, క్రీడలు రంగాల్లో స్ఫూర్తిదాయకమైన సేవలు అందిస్తున్న ప్రముఖులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డులను అందజేస్తున్నామని, గతంలో అశోక గజపతిరాజు, కె.విశ్వనాథ్ వంటి ప్రముఖులు ఈ అవార్డును స్వీకరించినట్లు సుధాకర్ గుర్తుచేశారు. ట్రస్ట్ బాధ్యుల్లో ఒకరైన జిల్లా కేంద్రసహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య మాట్లాడుతూ నన్నపనేని వెంకట్రావు విశాలాంధ్ర ఉద్యమంలోనూ ప్రముఖుడిగా చెప్పారు. అవార్డు ప్రదానోత్సవం సందర్భంగా ఆయన్ను మరోసారి స్మరించుకుందామని తెలిపారు. వీరితో ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ నన్నపనేని భాస్కర్ వున్నారు.

సినిమా వారిని విమర్శించడమే రాజకీయమా?

సినీ దర్శకుడు దిలీప్ రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: సినీ నటీనటులను విమర్శించడమే రాజకీయమైతే ఆయా పార్టీల మేనిఫెస్టోలో చూపిస్తూ ఎన్నికల బరిలోకి వెళ్లాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (మా-ఏపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్ రాజా అన్నారు. సినిమా వాళ్ళంటే ఎంతో చులకనభావంతోనే వారి వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఆలపాటినగర్‌లోని 'మా-ఏపీ' కార్యాలయంలో శుక్రవారం దర్శకుడు కనపర్తి రత్నాకర్, నటుడు వేమూరి విజయభాస్కర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివిధ భాషల్లో హీరోయినగా నటిస్తూ ఎంతో ప్రేక్షకాదరణ పొందిన ఒక సినీ హీరోయిన్ విడాకులపై తెలంగాణ మంత్రి చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. తోటి రాజకీయ నాయకులపై విభేదాలుంటే, విమర్శలు అక్కడికే పరిమితం కావాలనీ, సినిమా నటులపై సెటైర్లు వేయటానికి వాడుకోవటం తగదన్నారు. సినీనటుల మనోభావాలు దెబ్బతినేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదని దిలీప్‌రాజా హెచ్చరించారు. సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్, వేమూరి విజయభాస్కర్ ప్రశ్నించారు. వీరితో డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ మురళీకృష్ణ, సహాయ దర్శకుడు ఇంటూరి విజయ భాస్కర్ కూడా ఉన్నారు.

ఇసుక అందుబాటుపై సీఐటీయూ ప్రదర్శన



సబ్‌కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెనాలి: సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇసుకను అందుబాటులో ఉంచాలని కోరుతూ సీపీఎం తెనాలి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గాంధీ చౌక్ సెంటర్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ఈ ప్రదర్శనలో రాష్ట్ర ప్రభుత్వం ఇసుకపై ఇచ్చిన హామీలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, మల్టిపుల్ స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు ప్రదర్శకుల నుద్దేశించి సీపీఎం తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడారు. నిర్మాణ పనులకు ఇసుక ఎంతో కీలకమైందని, ఇసుక నిరంతరం అందుబాటులో ఉంటే, నిర్మాణ కార్యక్రమాలు సజావుగా జరుగుతాయని, 13 రకాల భవన నిర్మాణ కార్మికులకు ప్రతిరోజూ పని లభిస్తుందని చెప్పారు. సిమెంట్, స్టీల్, టైల్స్, వుడ్, గ్లాస్, చిప్స్, విద్యుత్ పరికరాలు, ప్లంబింగ్, శానిటరీ, వాటి ఫిక్సింగ్ పరికరాలకు డిమాండ్ బాగా పెరుగు తుంది అని, వాడకం పెరిగి దానివలన ఉత్పత్తి పెరుగుతుందని గుర్తుచేశారు. వినియోగం పెరగడం వల్ల ఉపాధి అవకాశాలు హెచ్చుగా ఉంటాయన్నారు. తద్వారా ప్రభుత్వాలకు ఆదాయం, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతాయని వివరించారు. నదీ గర్భం నుంచి వచ్చే ఇసుకతో పాటు రాక్ సాండ్‌ను కూడా అందుబాటులో తేవాలని సూచించారు. తాపీ కార్మిక సంఘం తెనాలి డివిజన్ కమిటీ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇసుక లేనందువల్ల కార్మికులకు పని దొరకటం లేదనీ, అప్పులతో జీవిస్తున్నారని చెప్పారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇసుకను మాఫియా నుంచి ప్రజలకు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ ఫకీర్ అహ్మద్, భూపతి కృష్ణయ్య, ఆనం దుర్గారావు, రెడ్డి సాయికుమార్, షేక్ జహలుద్దీన్, శెట్టి యేసోబు. అబ్రహ్మం, వెంకట్, దాసు, యేసుపాదం,జహరుద్దీన్, అంకమ్మ, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన అధికారులు

కొల్లిపర డీఆర్‌డీఏ ఏపీఎంగా రమాదేవి

కొల్లిపర: మండల డీఆర్‌డీఏ ఏపీఎంగా రమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఆమె డీఆర్‌డీఏ మంగళగిరి నుంచి బదిలీపై కొల్లిపర మండలానికి వచ్చినట్లుతెలిపారు. ఆమెతో పాటు సీసీలు వి.విజయకుమార్, డి.మధు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించి వీరు మర్యాద పూర్వకంగా ఎంపీడీవో వి.విజయలక్ష్మిని కలసి పుష్పగుచ్ఛం అందించారు.

పంచాయతీ రాజ్ ఏఈగా సాంబిరెడ్డి

కొల్లిపర: మండల పంచాయతీ రాజ్ ఏఈగా అవుతు సాంబిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన తాడేపల్లి నుంచి బదిలీపై కొల్లిపర మండలానికి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఏఈని మర్యాద పూర్వకంగా కలసి స్వాగతించారు.

చిరస్మరణీయుడు 'మా' గోఖలే



మాట్లాడుతున్న లక్ష్మా రెడ్డి

తెనాలిరూరల్: సనాతన కుటుంబంలో పుట్టి, కమ్యూనిస్టుగా మారి అభ్యుదయ రచయిత గా, కళా దర్శకుడిగా ఎదిగిన మాధవపెద్ది గోఖలే చిరస్మరణీయుడని పలువురు పేర్కొన్నారు. గోఖలే వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక నందులపేటలోని ఇస్కస్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సభలో మున్నంగి లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ కులమతాలు మనుషులు నిర్మించుకున్న అడ్డుగోడలని నమ్మిన వ్యక్తి గోఖలే అని చెప్పారు. అరసం ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్‌బాబు, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు దక్కని భరోసా

- పాపం పంట నష్టపోయిన రైతులు!
- ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోదు
- పరిహారం పెంపుదల చేయాలి
- పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలి
- రైతుసంఘం, కౌలురైతుల సంఘం డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

తెనాలి: వరదలకు పంటలు నష్టపోయిన రైతులు, కౌలురైతులు అందరికీ పరిహారం ఇప్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలురైతుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రైతులు, కౌలురైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం పెంపుదల చేయాలని, పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పరిహారం జాబితాలో లేని రైతులు, కౌలురైతులు అర్జీల దరఖాస్తుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు చివరి రోజైన శుక్రవారం వీరంతా స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అర్జీలను అందజేశారు. ముందుగా కార్యాలయం ఎదుట తమ డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు.

మాగాణిలో వేసిన వరిపైరు ఎందుకూ పనికిరాకుండా పోయిందని, పెట్టుబడి ఖర్చుల కింద అప్పటికే రూ.25 వేలు వ్యయం చేసినట్టు రైతులు తెలిపారు. రూ.10 వేలు, వాణిజ్య పంటలైన పసుపు, కంద, అరటి, తమలపాకు తోటలకు ప్రకటించిన రూ.14 వేల సాయం ఎందుకూ సరిపోదన్నారు. ప్రభుత్వం సాయం మళ్లీ పంటల సాగుకు ఏమాత్రం భరోసా ఇవ్వదని స్పష్టం చేశారు. వరికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పరిహారం పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిహారాన్ని కౌలు రైతులకు అందించకుండా, భూ యజమానుల ఖాతాల్లో వేయటం సమంజసం కాదన్నారు. వరదలకు గ్రామాల్లోని ఇళ్లు జలమయమైతే కొన్ని ఇళ్లను వరద నష్టం నుంచి మినహాయించటం తీవ్ర అన్యాయం చేసినట్టేనన్నారు.

నాకు పరిహారం ఏది?



వరదల కారణంగా రెండెకరాల్లో వేసిన వరిపైరు మునిగిపోయింది. ప్రభుత్వ నష్టపరిహారం జాబితాలో నా పేరు లేదు. నేనెలా వ్యవసాయం చేయాలి? ప్రభుత్వం రూ.10 వేల పరిహారం ప్రకటించినప్పటికీ ఆ ప్రకారం సాయం అందటం లేదు. చాలామంది రైతులకు రూ.3 వేలు, రూ.4 వేలు నుంచి రూ.7-8 వేలు చొప్పున ఇస్తుండటం అన్యాయం.

– వేజండ్ల తబిత, కౌలురైతు

ఏమాత్రం భరోసా లేదు



వరదలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన సాయంతో ఏమాత్రం భరోసా లేదు. తక్షణమే వరికి, వాణిజ్య పంటలకు పరిహారం పెంపుదల చేయాలి, రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని కలిపి వెంటనే అందజేయాలి. కృష్ణాపశ్చిమ డెల్టాలో పంటకాల్వలు, మురుగు కాల్వలను బాగుచేయాలి. కాల్వ కట్టలను పటిష్టం చేయాలి.

– ములకా శివసాంబిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు, రైతుసంఘం

కౌలురైతులకు తీవ్ర అన్యాయం



పంటల నష్టపరిహారంలో కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. చాలమంది కౌలరైతుల పేర్లను నమోదు చేయలేదు. వాస్తవ సాగుదారులకు పరిహారాన్ని ఇవ్వడం లేదు. అలాగే ఇళ్లు మునిగిన బాధితుల పేర్ల నమోదులోనూ వివక్ష కనిపిస్తోంది. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

– బైరగాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు, కౌలురైతుల సంఘం

మృతదేహం వెలికి తీసి పరీక్ష



తెనాలిరూరల్: ఇటీవల సంచలనం సృషించిన వరుస సైనేడ్ హత్య కేసుల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా పూడ్చిపెట్టిన మృత దేహాన్ని వెలికి తీయించి శవపరీక్ష జరిపారు.పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, మునగప్ప రజినీ, రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేసి ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరు హత్య చేసిన యడ్ల లింగయ్య కాలనీకే చెందిన కఠెవరపు మోషే బంధువు మేకల పుష్ప ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 2వ తేదీన జరిగిన మోషే హత్యలో వెంకటేశ్వరి, రజనీ, రమణమ్మలతో పాటు అతని భార్య పాత్ర ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ట్రైనీ డీఎస్పీ ఎంఎస్ భార్గవి, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, సిబ్బంది కొల్లిపర మండలం హనుమాన్‌పాలెంలో మోషే మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ప్రదేశానికి శుక్రవారం వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. గుంటూరు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ సుజ్ఞాన్ శవపరీక్ష జరిపి మృతదేహం నుంచి కొన్ని శాంపిళ్లను సేకరించారు. నెల రోజుల్లో ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు వస్తుందని, దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: పట్టణ మారిస్‌పేట నుంచి చెంచుపేట వైపు వెళ్లే ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సుమారు ఏడు గంటల సమయంలో మారిస్‌పేటకు చెందిన డోగిపర్తి శివ శంకర్(49) ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు ఘటనాస్థలానికి చేరుకుని బ్రిడ్జి మీద పడి ఉన్న మృతదేహాన్ని ఫుట్‌పాత్ మీదకు మార్చారు. శివ శంకర్‌ను ఏ వాహనం ఢీ కొట్టిందో కూడా అక్కడ ఉన్న వారు ఎవరూ గుర్తించలేని పరిస్థితి నెలకొంది. అక్కడ సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించలేక పోతున్నారు. రద్దీగా ఉన్న సమయంలో బ్రిడ్జి మీద ప్రమాదం జరగడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ నిలిచి పోయింది.



తెనాలి గంగానమ్మపేటలో శ్రీ అన్నపూర్ణదేవిగా..



తెనాలి దేవీచౌక్‌లో శ్రీధనలక్ష్మీదేవి అలంకారంలో..



తెనాలి మారీసుపేటలోని శ్రీధనలక్ష్మీదేవిగా..



తెనాలి రామస్వామిపేటలో శ్రీసంతానలక్ష్మిగా..



నందివెలుగులో శ్రీధనలక్ష్మి దేవి అలంకారం